ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఉమ్మడిగా.. దూకుడు

- రెండో జాబితాలో నలుగురు పేర్లు
- సంబరాల్లో మునిగిన తెలుగు తమ్ముళ్లు
- పల్నాడులో నరసరావుపేట, బాపట్లలో చీరాల పెండింగ్
- అధికారికంగా అభ్యర్థులను ప్రకటించని వైసీపీ అధిష్ఠానం
- టీడీపీ తొలిజాబితాలో ప్రకటించిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రాజకీయ వేడి రగులుతుండగా ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ దూకుడు పెంచుతోంది. ఇప్పటికే స్పష్టత వచ్చిన స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇక వైసీపీలో అధికారికంగా అభ్యర్థులు పేర్లు ప్రకటించలేదు. పైగా అసమ్మతితో పలు నియోజకవర్గాలు శ్రేణులు రగిలిపోతున్నాయి. సమరోత్సాహంతో టీడీపీ శ్రేణులు దూసుకెళ్తోండగా, అభ్యర్థులపై అయోమయం, అసమ్మతితో ఫ్యాన్ పార్టీలో నిస్తేజం నెలకొంది. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఖరారు కావడంతో ఆయా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల్లో సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి 20 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు టీడీపీ, జనసేన పార్టీల రెండు జాబితాలను విడుదల చేయగా అందులో 18 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. గురువారం చంద్రబాబు ప్రకటించిన రెండో జాబితాలో పల్నాడు జిల్లాకు సంబంధించి పెదకూరపాడు, గురజాల, గుంటూరు జిల్లాకు చెందిన గుంటూరు తూర్పు, పశ్చిమ స్థానాలు ఉన్నాయి. ఆది నుంచి ఉత్కంఠ రేపుతున్న గుంటూరు నగర పరిధిలోని రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థులు ఎట్టకేలకు ఖరారయ్యారు. దీంతో గుంటూరు లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి అయినట్లైంది. తాజాగా విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు తూర్పు అభ్యర్థిగా ఎండీ నసీర్ అహ్మద్ పేరు ఖరారు చేశారు. ఇక పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక విషయంలో కొద్ది రోజులుగా సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వాస్తవానికి ఈ సీటు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కోవెలమూడి నానీకి ఇవ్వాల్సి ఉంది. అయితే ఊహించని విధంగా మంత్రి విడదల రజిని వైసీపీ అభ్యర్థిగా గుంటూరు పశ్చిమకు వలస రావడంతో నానీ అదృష్టం తారుమారైంది. రజినీది బీసీ సామాజికవర్గం కావడంతో అదే సామాజికవర్గం మహిళను బరిలోకి దించాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. దీంతో బీసీ సామాజికవర్గానికి చెందిన పిడుగురాళ్ల మాధవి(రజక)ని అదృష్టం వరించింది. ఆమె భర్త, రియల్ ఎస్టేట్ వ్యాపారి గళ్ళా రామచంద్రరావు(కమ్మ) కున్న ఆర్థిక అంగ బలాలు ఆమెకు కలిసొచ్చాయి. శ్రీ భ్రమర టౌన్ షిప్స్, వికాస్ హాస్పటల్స్ ఎండీగా కొనసాగుతున్న రామచంద్రరావుకు గుంటూరులో ఉన్న పరిచయాలు కూడా మాధవి అభ్యర్థిత్వం వైపు టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపేలా చేశాయి. గురజాల నియోజకవర్గాలకు పార్టీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడుకు భాష్యం ప్రవీణ్ పేర్లను ప్రకటించింది.

దూసుకెళ్తోన్న అభ్యర్థులు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే 20 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి తొలివిడతలో 14 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. వారి పేర్లను చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు గతంలోనే ప్రకటించారు. దీంతో ఆయా అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తోన్నారు. మంగళగిరి నుంచి నారా లోకేశ్ పేరు తొలి జాబితాలోనే ప్రకటించగా ఆయన ఇప్పటికే విజయపథం వైపు దూసుకుపోతున్నారు. పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వరుసగా ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగి ఎన్నికల శంఖారావం పూరించారు. ఇప్పటి వరకు ఐదు విజయాలను చవిచూసిన నరేంద్ర ఆరో పర్యాయం కూడా గెలిచి చట్టసభలోకి అడుగుపెట్టాలనే సంకల్పంతో ఎన్నికల యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఎస్సీ నియోజకవర్గాలైన తాడికొండ, ప్రత్తిపాడు నుంచి టీ శ్రావణ్‌కుమార్, బీ రామాంజనేయులు బరిలోకి దిగి ప్రచార పర్వంలో మునిగిపోయారు. తొలి జాబితాలోనే బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఐదు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి పోటీలో ఉండే అభ్యర్థులను టీడీపీ ప్రకటించగా ఆయా అభ్యర్థులు ప్రచార పర్వంలో ఉన్నారు. పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్, అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్, వేమూరు నుంచి నక్కా ఆనంద్‌బాబు, బాపట్ల నుంచి తొలిసారి వేగేశన నరేంద్రవర్మ ఇంటింటి ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి సీనియర్ నేతలకు టీడీపీ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చింది. వినుకొండకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, చిలకలూరిపేట ప్రత్తిపాటి పుల్లారావు, సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల జూలకంటి బ్రహ్మారెడ్డిల పేర్లు తొలిజాబితాలోనే అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. వారు ప్రచారంలో నేరుగా ఓటర్లను కలుస్తున్నారు.



యరపతినేని శ్రీనివాసరావు, గురజాల



జీవీ ఆంజనేయులు, వినుకొండ



ప్రత్తిపాటి పుల్లారావు, చిలకలూరిపేట



కన్నా లక్ష్మీనారాయణ, సత్తెనపల్లి



జూలకంటి బ్రహ్మారెడ్డి, మాచర్ల



భాష్యం ప్రవీణ్, పెదకూరపాడు



నారా లోకేశ్, మంగళగిరి



నసీర్ అహ్మద్, గుంటూరు-1



పి.మాధవి, గుంటూరు-2



టి.శ్రావణ్‌కుమార్, తాడికొండ



డి.నరేంద్రకుమార్, పొన్నూరు



ఎన్.మనోహర్, తెనాలి



రామాంజనేయులు, ప్రత్తిపాడు



అనగాని సత్యప్రసాద్(రేపల్లె), వేగేశన నరేంద్రవర్మ(బాపట్ల), ఏలూరి సాంబశివరావు (పర్చూరు), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), నక్కా ఆనందబాబు (వేమూరు)

తొలిసారి.. భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా తుళ్లూరు మండలం పెద పరిమి గ్రామానికి చెందిన భాష్యం ప్రవీణ్ బరిలోకి దిగనున్నారు. వ్యవసాయ కుటుంబం నేపథ్యం కలిగిన లావణ్య, వెంకటరావుల ప్రథమ సంతానం ప్రవీణ్. టీడీపీలో క్రియాశీలకంగా ఉండే ప్రవీణ్‌కు తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని చంద్రబాబు కల్పించారు. తన పేరును అధిష్ఠానం ప్రకటించగానే ప్రవీణ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలసి సహాయ సహకారాలను కోరారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి ప్రవీణ్‌కు మద్దతు తెలియజేసి ఆయన్ను సత్కరించి అభినందనలు తెలిపారు. కొంతకాలంగా టిక్కెట్ వస్తుందని భావించిన భాష్యం ప్రవీణ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని క్యాడర్‌ను పరిచయం చేసుకున్నారు. తొలుత ప్రవీణ్ చిలకలూరిపేట నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ పెదకూరపాడుకు ఆయనను అధిష్ఠానం పంపింది.

ఏడో సారి యరపతినేని

గురజాల నుంచి యరపతినేని శ్రీనివాసరావు ఏడో సారి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగనున్నారు. యరపతినేని 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో ఓటమి పాలవగా 2009, 2014 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దాచేపల్లిలో ఇటీవల అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేసి సత్తా చాటారు. దీంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

రెండో సారి నసీర్

మొహమ్మద్ నసీర్ గుంటూరు తూర్పు నుంచి రెండో సారి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. 2019లో పోటీ చేసిన ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ పటిష్ఠతే ధ్యేయంగా నియోజకవర్గంలో పనిచేశారు. పార్టీ కార్యకలాపాలతోపాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారు. నియోజకవర్గ పరిధిలో అనేక రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సహాయం అందజేశారు. ఇక్కడి నుంచి తొలుత కొత్త అభ్యర్థిని దించాలని భావించినప్పటికీ నసీర్ కంటే మెరుగైన అభ్యర్థి దొరకలేదు. దీంతో ఆయన అభ్యర్థిత్వానికే పార్టీ అధినేత చంద్రబాబు ఆమోదం తెలిపారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఈ ఐదేళ్లపాటు కష్టకాలంలో పార్టీకి అండగా నిలవటం నసీర్‌కు ప్లస్ పాయింట్ అయింది.

సేవారంగం నుంచి రాజకీయాల్లోకి మాధవి

పొన్నూరు నియోజకవర్గంలోని ములుకుదురుకు చెందిన పిడుగురాళ్ల మాధవి బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చారు. ఎంసీఏ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యారు. అనంతరం కొంతకాలం బోధనా వృత్తిలో కొనసాగారు. ఆమె తండ్రి కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేశారు. ఆయన స్ఫూర్తితో మాధవికి ప్రజాసేవపై ఆసక్తిగా వుండేది. శ్రీభ్రమరలో చారిటీ ట్రస్టును స్థాపించి పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సమ్మతి.. అసమ్మతి

పల్నాడు జిల్లాలో అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అయితే అందుకు విరుద్ధంగా వైసీపీలో సమన్వయకర్తల పేరిట జరుగుతున్న తంతుతో అసమ్మతి రేగుతోంది. వైసీపీ అధినేత జగన్ వద్ద పంచాయతీ జరిగినా అసమ్మతి వర్గాలు శాంతించడంలేదు. పల్నాడు జిల్లాలో ఆరుగురు అభ్యర్థులను ప్రకటించగా, వైసీపీ అధికారికంగా ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే ఇద్దరు సమన్వయకర్తలను మార్చింది. ఇక్కడ వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. కొత్తగా నియమితులైన గుంటూరు మేయర్ కావేటి మనోహర్‌నాయుడును సమన్వయకర్తగా నియమించడాన్ని వైసీపీ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. ఇక నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కూడా వైసీపీలో అసమ్మతి తారాస్థాయికి చేరింది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి సీఎం జగన్ చెప్పినా అసమ్మతి నేతలు మెట్టు దిగిరాలేదని తెలుస్తోంది.

నరసరావుపేట, చీరాలపై ఉత్కంఠ

బాపట్ల జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్క చీరాల మాత్రమే పెండింగ్‌లో ఉంది. గురువారం విడుదల చేసిన రెండోజాబితాలో చీరాలతో పాటు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చోటు దక్కలేదు. దీంతో ఈ రెండు సీట్ల విషయంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. నరసరావుపేట అభ్యర్థి విషయంలో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. అయినా అభ్యర్థి విషయంలో అధిష్ఠానం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.



టీడీపీలోకి.. జంగా?

- రెండు దఫాలుగా ఎంపీ లావుతో చర్చలు
- గుంటూరు, నరసరావుపేటల్లో వరుస భేటీలు

నరసరావుపేట, మార్చి 14: పల్నాడులో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైందన్న ప్రచారం జరుగుతోంది. నరసరావుపేట లోక్‌సభ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్సీ జంగాతో జరిపిన చర్చలే ఇందుకు నిదర్శనమని పలువురు భావిస్తున్నారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో గురువారం ఉదయం, నరసరావుపేటలోని ఎంపీ కార్యాలయంలో సాయంత్రం రెండు దఫాలుగా లావు, జంగా భేటీ అయ్యారు. జంగా టీడీపీలో చేరికపై ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. రెండు రోజుల్లో జంగా టీడీపీలో చేరతారన్న ప్రచారం ఊపందుకుంది. ప్రభుత్వ విప్ పదవి నుంచి వైసీపీ అధిష్ఠానం జంగాను తొలగించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ పదవి విషయంలోనూ అధిష్ఠానం కృష్ణమూర్తికి పొమ్మనకుండా పొగపెడుతున్నట్లు సమాచారం. వైసీపీని వీడాల్సిన పరిస్థితులను అధిష్ఠానం కల్పిస్తోందని జంగా అనుచరులు అంటున్నారు. తన అనుచరులతో చర్చించి టీడీపీలో చేరే అంశంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు జంగా తెలిపారు. ఎంపీ తనతో చర్చించిన మాట వాస్తవమేనని, టీడీపీలో చేరాలని ఎంపీ తనను కోరినట్లు చెప్పారు.

లోపలి పేజీలో...

అమరావతిపై ఆగని విచ్ఛిన్నం..
- ఇప్పటికే రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌రెడ్డి
- 1549వ రోజుకు రైతుల ఆందోళనలు

వలిగొండ - కుక్కడం మధ్య డబ్లింగ్‌కు నోటిఫికేషన్ జారీ

బాబ్లీ కేసులో ఆనందబాబుకు సమన్లు
- బిలోలి కోర్టులో విచారణకు హాజరు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(శుక్రవారం)
సహెరీ (ఉదయం) 4.59 (శనివారం)

తక్కెళ్లపాడు గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై యరపతినేని తదితరులు



పల్నాడుకి తాగునీరుని అందిస్తాం



బందోబస్తుపై టీడీపీ నేతలతో చర్చిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీజీ అధికారులు



సభావేదిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు



శరవేగంగా సాగుతున్న సభావేదిక నిర్మాణ పనులు

బొప్పూడి సభకు భారీగా సన్నాహాలు

- ఏర్పాట్లపై ఉమ్మడిగా కసరత్తు
- శరవేగంగా సభా వేదిక పనులు
- భద్రతా చర్యలపై ఎస్పీజీ బృందం సమీక్ష

చిలకలూరిపేట, మార్చి 14: టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఖరారు అయిన తర్వాత తొలిసారి చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా 17వ తేదీ ఆదివారం జరిగే బహిరంగ సభకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఎస్పీజీ బృందం రంగంలోకి దిగింది. పటిష్ఠమైన బందోబస్తుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భారీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. వేదిక వద్ద ఏర్పాట్లను ఎస్పీజీ బృందం గురువారం పరిశీలించింది. భద్రతా చర్యలపై కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలతో ఎస్పీజీ బృందం సమీక్షించింది. టీడీపీ నేతల నుంచి సభా ప్రాంగణానికి సంబంధించిన వివరాలను ఎస్పీజీ అధికారులు తీసుకున్నారు. ఉమ్మడి సభ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు మూడు పార్టీల నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దాదాపు 15 లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బొప్పుడి వద్ద జాతీయ రహదారికి అనుకుని ఉన్న 200 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభా వేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు రోజులే సమయం ఉండటంతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఎక్కువగా జనసమీకరణ చేయాలని నేతలు నిర్ణయించి ఆ మేరకు ప్రణాళికలు రూపొందించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగని రీతిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలికాప్టర్లలో రానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షిస్తున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రామారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితర టీడీపీ నేతలు పరిశీలించారు.

సభ దద్దరిల్లాలి: మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్: నవ్యాంధ్ర భవిష్యత్‌కు దశ, దిశ చూపే బొప్పూడి ఉమ్మడి సభ దద్దరిల్లాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. చిలకలూరిపేటలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలిసి పుల్లారావు మాట్లాడుతూ సిద్ధం పేరిట గ్రాఫిక్స్ చూపించిన జగన్‌కు కలలో కూడా చిలకలూరిపేట సభే కనపడాలని ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కష్టపడాలన్నారు. ప్రధాని మోదీ పాల్గొనే ఈ సభను విజయవంతం చేయడం ద్వారా ఢిల్లీలో శ్రీకృష్ణ దేవరాయలు కనపడితే సభకు గుర్తుకు వచ్చేలా చేయాలన్నారు. 2014లో టీడీపీ ఎన్డీఏలో చేరినప్పుడు నిర్వహించిన సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తానే అధ్యక్షత వహించినట్లు గుర్తు చేశారు. ఆ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశామని, 2014 సభ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలన్నారు.



జైలు నుంచి విడుదలైన కుమారుడు శరత్‌ను ఆలింగనం చేసుకున్న పుల్లారావు

ధర్మం గెలిచింది : ప్రత్తిపాటి

ఎన్నికల అధికారులు

నరసరావుపేట, మార్చి 14: ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఎన్నికల కమిషన్ నియమించింది. లోక్‌సభ స్థానానికి, జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఆర్వోలను నియమించింది.

స్థానం	హోదా	పేరు	ఫోన్ నెంబరు
నరసరావుపేట(లోక్‌సభ)	కలెక్టర్	శివశంకర్	9154959301
పెదకూరపాడు(అసెంబ్లీ)	డిప్యూటీ కలెక్టర్	కే శ్రీరాములు	8500408235
చిలకలూరిపేట	స్పెషల్ కలెక్టర్	బీ నారదముని	9652344669
నరసరావుపేట	ఆర్డీవో	పీ సరోజినీ	9849150077
సత్తెనపల్లి	ఆర్డీవో	వీ మురళీకృష్ణ	9154959294
వినుకొండ	స్పెషల్ కలెక్టర్	వీ సుబ్బారావు	
గురజాల	ఆర్డీవో	జీవీ రమణకాంత్‌రెడ్డి	8897383565
మాచర్ల	జాయింట్ కలెక్టర్	ఏ శ్యాంప్రసాద్	9154959302

సీఎం జగన్ రాజీనామా చేయాలి

- గ్రూప్-1 మెయిన్స్‌పై అభ్యర్థుల అభియోగాలను ధ్రువీకరించిన కోర్టు
- నైతిక బాధ్యత సీఎం జగన్, ఇప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌లదే..

సత్తెనపల్లి మార్చి 14: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-1 పోస్టుల ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పుపట్టినందున, అందుకు సీఎం జగన్ నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని సత్తెనపల్లి టీడీపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పు పట్టిందని అన్నారు. మెయిన్స్ పరీక్షా పత్రాల రీ-వాల్యుయేషన్‌ను ప్రొఫెసర్ల చేత కాకుండా డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో చేయించారని అభ్యర్థులు మోపిన అభియోగాన్ని కోర్టు నిర్ధారించిందన్నారు. దీనికంటే అవమానం ఈ ప్రభుత్వానికి ఇంకొకటి లేదన్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌తో పాటూ సీఎం జగన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి సీతా రామాంజనేయులు అత్యున్నత నియామక ప్రక్రియ అయిన గ్రూప్-1 పోస్టుల ఎంపికను ఇష్టారాజ్యంగాచేశారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇవ్వగా మెయిన్స్ ప్రక్రియ అంతా వైసీపీ ప్రభుత్వ పాలనలోనే జరిగిందన్నారు. అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌గావున్న ఉదయభాస్కర్‌ను ప్రక్కన పెట్టి కార్యదర్శిగా ఉన్న సీతారామాంజనేయులు అక్రమాలకు పాల్పడ్డారని, అనంతరం ఆ పదవిలోకి వచ్చిన గౌతమ్ సవాంగ్ దీనికంతా బాధ్యత వహించాలని కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.


బిలోలి కోర్టులో విచారణకు హాజరైన మాజీ మంత్రి ఆనందబాబు

బాబ్లీ కేసులో ఆనందబాబుకు సమన్లు

- బిలోలి కోర్టులో విచారణకు హాజరు

వేమూరు, మార్చి14: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు ఉద్యమం సందర్భంగా నమోదైనకేసులో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబుకు బిలోలి కోర్టు సమన్లు జారీ చేసింది. గురువారం ఆయన మాజీ మంత్రి దేవినేని ఉమతో పాటు బిలోలి కోర్టుకు హాజరయ్యారు. గోదావరి నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు ఆనకట్ట ఏర్పాటు చేసింది. దిగువకు రావలసిన నీటిని సకాలంలో రానీయకుండా గేట్లు వేయడం జరిగింది. దీంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సాగునీరు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో టీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఉద్యమంలో మహారాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. అందులో ఆనందబాబు పేరును కూడా చేర్చడం జరిగింది. సంబంధించిన కేసు విషయంపై బిలోలి కోర్టు తాజాగా సమన్లు జారీ చేయడంతో పాటు కోర్టులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో ఆనందబాబు గురువారం విచారణకు కోర్టుకు హాజరయ్యారు. వారెంట్లు రీ కాల్ చేయాలని న్యాయవాదులు గింజుపల్లి సుబ్బారావు, కృష్ణారెడ్డిలు కోర్టును కోరడం జరిగింది. న్యాయవాదుల అభ్యర్థన మేరకు తాత్కాలికంగా కేసు విచారణను నిలుపుదల చేయడం జరిగింది.

రాష్ట్రంలో అడ్డగోలుగా ఇసుక దోపిడి

- ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి...
- పెమ్మసాని, నాదెండ్ల


ఇసుక గుట్టలను పరిశీలిస్తున్న పెమ్మసాని నాదెండ్ల మనోహర్

కొల్లిపర, మార్చి 14: రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమ ఇసుక నిల్వలు కనిపిస్తున్నాయని దొంగల దోపిడీ కొనసాగుతోందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం తెనాలి నియోజకవర్గం ప్రచారం కార్యక్రమంలో భాగంగా అత్తోటనుంచి కొల్లిపర వెళ్లే దారిలో అక్రమ ఇసుక నిల్వలు పరిశీలించిన సందర్భంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలు ఓ పక్క ఇసుకను దోచుకుంటూ సంక్షేమం అని చెప్పుకుంటు న్నారన్నారు. 25 టన్నుల నుంచి 30 టన్నుల వరకు వెళ్ళుతున్న భారీ ఇసుక వాహనాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఇసుక వాహనాలు ఎక్కడకు వెళ్ళుతున్నాయని ప్రశ్నించగా డ్రైవర్లు నోరు మెదపలేదన్నారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పట్టపగలే అక్రమంగా తరలిస్తున్న ఈ ఇసుక వాహనాలకు అనుమతులు ఉన్నాయా, అర్ధరాత్రి సమయాల్లో తవ్వకాలకు అనుమతులు ఎవరిచ్చారని చూపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పాలకులకు యలా బుద్ధి చెప్పాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు వచ్చి రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజుకు వెయ్యికి పైగా లారీ ట్రక్కులతో ఇసుకను తరలిస్తున్నారని, తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వారి దృష్టికి తీసుకువచ్చారు.


తక్కెళ్లపాడు గ్రామంలో మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

పల్నాడుకి తాగునీరుని అందిస్తాం

- ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి మార్చి14: గోదావరి జలాలను సాగర్ కుడికాలువలో కలిపి పల్నాడు ప్రాంతానికి తాగునీరు అందిస్తామని నరసరావుపేట టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. గురువారం దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామంలో సర్పంచ్‌గా కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకార కార్యక్రమానికి టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేయనున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం జలజీవన్ మిషన్ ద్వారా రూ.50 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు నిధులు తీసుకొచ్చి నిర్మాణం పూర్తిచేయడంతో పాటు మరికొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుందని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, తానుకలిసి గురజాల నియోజకవర్గంలో 50 కిలోమీటర్లు సీసీ రోడ్లు నిర్మిస్తామని, రూ.50 కోట్లతో సైడ్ డ్రైన్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలకు షాదీఖానాలు, కమ్యూనిటీ హాల్స్, పంట పొలాలకు రహదారులు నిర్మిస్తామని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తిట్టడంతోనే ఓట్లు రావు.. పనిచేస్తేనే ఓట్లు వస్తాయని ఎంపీ లావు అధికార పార్టీ నేతలకు పరోక్షంగా సూచనలు చేశారు. యరపతినేని మాట్లాడుతూ.. పల్నాడులో కులాల కుంపటి పెట్టి రక్తపాతం సృష్టించాలని చూస్తున్నారని, టీడీపీ జనసేన కార్యకర్తలు సమన్వయాన్ని కోల్పోవద్దని అన్నారు. తక్కెళ్లపాడును గత టీడీపీ ప్రభుత్వం అన్నివిధాల అభివృద్ధి చేసిందని, మరో రెండు నెలల్లో రాష్ట్రంలో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాబోతుంది. చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలిప్పిస్తాం అని యరపతినేని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో గుంటుపల్లి నాగేశ్వరరావు, కన్నా రజని, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కర్నాటి వరలక్ష్మి, బడిదల శ్రీనివాస్, వేముల వినోద్‌రెడ్డి, కామిశెట్టి శ్రీనివాస్, అక్కినపల్లి బాలయ్య, బాలాజీనాయక్, నర్రా పుల్లయ్య, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, వేముల తిరుమలకుమార్, మామిడి చంద్రశేఖరరావు, బుర్రి కొండలు, చింతపల్లి హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తా

- ఏడోసారి టిక్కెట్ కేటాయించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు
- గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి14: గురజాల నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు యరపతినేని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. రెండవ జాబితాలో గురజాల అభ్యర్థిగా పేరు ప్రకటించిన తరువాత యరపతినేని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1994లో ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చానని, అప్పటి నుంచి గురజాల ప్రజలకు అండగా వుంటున్న తనకు వరుసగా ఏడోసారి గురజాల టిక్కెట్ ప్రకటించడం జరిగిందన్నారు. గతంలోనే గురజాల నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశామని, కృష్ణా పుష్కరాల సమయంలో వేల కోట్లతో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రేపటి ఎన్నికల్లో గెలుపొందిన తరువాత గురజాల ప్రాంత అభివృద్ధి, గురజాల ఓటర్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయనున్నట్లు స్పష్టంచేశారు. మాచవరం మండలంలో సరస్వతి ఫ్యాక్టరీకి భూములిచ్చిన రైతులపై వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడితే రైతులకు అండగా ఉన్నందుకే జగన్ తనపై కక్షకట్టి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టాలని చూశాడన్నారు. మొన్నటిదాకా వైనాట్ 175 అన్న జగన్ నేడు వైరాగ్యంతో ఓడినా ఇబ్బందేమి లేదన్నట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు గురజాల నియోజకవర్గంలో తానుకూడా సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో తాను చేపట్టిన పసుపు కుంకుమ, సీమంతం, షష్టిపూర్తి కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు యువతకు జాబ్‌మేళాను అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. తాగునీటి ప్రాజెక్టులు, కాల్వల ఆధునికీకరణతో చివరి భూముల వరకు సాగునీరు అందేలా చేస్తానని స్పష్టం చేశారు. పిడుగురాళ్ల బైపాస్ రహదారి, మెడికల్ కళాశాలను అసంపూర్తిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారన్నారు. పల్నాడులో శాంతిని నెలకొల్పేందుకు తాను మొదటిసారి ఎమ్మెల్యే అయిన తరువాత కాంగ్రెస్ నేతల ఇళ్లకు కూడా వెళ్లి రాజీతో ఎన్నో గ్రామాల్లో ఫ్యాక్షన్ లేకుండా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ వైసీపీ పాలనలో పురంశెట్టి అంకులు, దోమతోటి విక్రమ్‌తో పాటు మరెందరినో పొట్టన పెట్టుకోవడమే కాకుండా అక్రమమైనింగ్‌తో 8 మంది చిన్నారులు మృత్యువాత పడినా వైసీపీ నేతలు మాత్రం అక్రమ సంపాదనను వదలలేదన్నారు. ఈనెల 17న చిలకలూరిపేటలో జరిగే భారీ బహిరంగసభకు గురజాల నియోజకవర్గం నుంచి 30 వేల మంది పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూస్తున్నామన్నారు. సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, తురకా వీరస్వామి, షేక్ బాబావలి, మల్లెల ఆదినారాయణ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, కనిగిరి శ్రీను, మునగా వెంకట్, మేకల సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, పణితి రవి, చెన్నారావు, ఖాశింసైదా, శివనాగు, అడపా శ్రీనుతో పాటు తదితర నేతలు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్నవ మోహన కృష్ణ

అధినేత ఆదేశానుసారమే నడుస్తాం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

గుంటూరు,మార్చి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆదేశానుసారమే తాము నడుస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గురువారం ఆయన చంద్రబాబును కలిసి పశ్చిమ నియోజకవర్గ పరిస్థితి గురించి వివరించారు. తాజా పరిణామాల రీత్యా పశ్చిమ సీటు బీసీ అభ్యర్థికి కేటాయించాల్సి వచ్చిందని అధినేత తనతో చెప్పారని, ప్రకటించిన అభ్యర్థిని గెలి పించేందుకు కృషిచేయాలని కోరినట్లు మన్నవ తెలిపారు. అధినేత చంద్రబాబు ఆదేశానుసారమే పశ్చిమ కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషచేస్తామని మన్నవ తెలిపారు.

మెరిసిన పసుపు ధర

- క్వింటాల్ ధర రూ.15 వేలకు పైగా అమ్మకం

దుగ్గిరాల, మార్చి 14: పసుపు క్వింటాల్ ధర రూ.15వేలను దాటి పలికింది. స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో గురువారం జరిగిన వేలంలో 847 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. పసుపు ధర గరిష్టంగా కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,450, గరిష్ఠ ధర రూ.15,400 మోడల్ ధర రూ.15,311 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,450, గరిష్ఠ ధర రూ.15,400 మోడల్‌ధర రూ.15,311 పలికాయి. ఆశాజనకంగా పసుపు ధర పెరుగుదల కొనసాగుతుండటంతో రైతులు వేచిచూసే ధోరణిలో ఉండడంతో విక్రయాలకు ముందుకు రావడంలేదు.

లిఫ్ట్ ఇస్తారు.. దోచేస్తారు

- ఒంటరి ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీ
- ఏపీకి చెందిన దంపతులు నల్లగొండ జిల్లాలో అరెస్టు

నల్లగొండ టౌన్, మార్చి 14: లిఫ్ట్ ఇస్తామంటూ ఒంటరి ప్రయాణికులను నమ్మించి కారులో ఎక్కించుకుని దారిదోపిడీకి పాల్పడిన ఏపీకి చెందిన దంపతులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిమట గోపీకృష్ణ తన మొదటి భార్యతో గొడవ పెట్టుకుని ఒంటరిగా ఉండేవాడు. సత్తెనపల్లికే చెందిన వితంతువు చింత మహేశ్వరి తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. కారు డ్రైవర్ అయిన గోపీకృష్ణ, కూలి పనులు చేసుకునే మహేశ్వరి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. గోపికృష్ణ, మహేశ్వరి దంపతులు తమ సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఒంటరిగా ప్రయాణం చేసే వారిని లిఫ్ట్ పేరుతో నమ్మించి కారులో ఎక్కించుకుని దారిలో వారిని దోచుకోవాలని పథకం వేసుకున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముండే దుగ్గి కృష్ణారావు తన స్వస్థలం సత్తెనపల్లి మండలం బూరుగుపాడులో ఈ నెల 10న జరిగిన తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొని అదేరోజు రాత్రి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా గమనించిన గోపీకృష్ణ దంపతులు తమ నాటకం మొదలుపెట్టారు. ముందుగా సిద్ధం చేసుకున్న అద్దె కారులో కృష్ణారావు వద్దకు వెళ్లి తాము హైదరాబాద్ వెళుతున్నామని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలో ఎక్కించుకున్నారు. కారు నల్లగొండకు చేరుకోగానే దేవరకొండ రోడ్డులోని కొత్తపల్లి గ్రామ శివారుకు తీసుకెళ్లి ఆపారు. వెంటనే తమ వద్ద ఉన్న కత్తులను బయటకు తీసి కృష్ణారావును చంపేస్తామని బెదిరించి.. అతని వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీపై కృష్ణారావు 11వ తేదీన నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కారును గుర్తించారు. మర్రిగూడ బైపాస్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి కారు, 15గ్రాముల బంగారు గొలుసు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

ధర్మం గెలిచింది : ప్రత్తిపాటి

- తన కుమారుడు శరత్‌కు బెయిల్ రావడంపై పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి14: రాష్ట్ర ప్రభుత్వ అక్రమ కేసులపై న్యాయం గెలిచిందని, జగన్‌రెడ్డి నియంత నిర్ణయాలకు న్యాయవ్యవస్థ చెక్ పెట్టిందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. జీఎస్టీ కేసులో తన కుమారుడు శరత్‌కు బెయిల్ లభించడంపై ప్రత్తిపాటి స్పందించారు. జీఎస్టీకి సంబంధించి ప్రత్యేక చట్టం, వ్యవస్థ ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా శరత్‌ను జగన్‌రెడ్డి కక్ష పూరితంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకొని చట్టాలను కాపాడిందన్నారు. అవెక్సా కార్పొరేషన్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందే సమయానికి శరత్ కంపెనీలో ప్రవేశించలేదని, కేవలం 67 రోజులు మాత్రమే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారని వివరించారు. జీఎస్టీ నేరాలకు సంబంధించి ప్రత్యేక చట్టం ఉందని, దానినికాదని ఐపీసీ కింద పోలీసులు కేసు ఎలానమోదు చేస్తారని పుల్లారావు ప్రశ్నించారు. శరత్ అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సంపూర్ణ మద్దతు తెలిపారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. శరత్ త్వరగా జైలు నుంచి బయటకు రావాలని చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలంతా పూజలు, ప్రార్థనలు చేశారని, అవన్నీ ఫలించాయన్నారు. 15 రోజులుగా నిరసనలు తెలిపిన తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్షాలపై పోలీస్ వ్యవస్థను ప్రయోగించడం పెత్తందారీతనం అవుతుందని, ప్రజాస్వామ్యం కాదని, ఈ తరహా చర్యలు ప్రజాస్వామ్య మనుగడకు గొడ్డలిపెట్టని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విపరీత పోకడల గురించి విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో నియంత పాలనకు ముగింపు పలికేలా ఓటు అనే ఆయుధాన్ని వినియోగించాలన్నారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ తదితరులు

ఎస్ఆర్ఎంలో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు

మంగళగిరిసిటీ, మార్చి14: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆధునిక పర్యావరణ సమతుల్యత అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ నిపుణులసదస్సు గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ ఈ సదస్సును ప్రారంభించారు. ఎస్ఆర్ఎం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు వివిధ ప్రాంతాలనుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో వందలాది మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు హాజరయ్యారు. సెంటర్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ వేస్ట్ టెక్నాలజీ (యూఎస్‌ఏ) ప్రొఫెసర్ ప్రకాశం టాటా కీలక ఉపన్యాసం అందించారు. యూనివర్సిటీ విద్యార్థులు తయారుచేసిన 165 పరిశోధనా రంగ ప్రచురణల్లో 106 ఆర్టికల్స్ క్యూవన్ జర్నల్స్‌లో ప్రచురితం కావడం విశేషమని డాక్టర్ రంగభాష్యం పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన అబ్‌స్ట్రాక్ట్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సలహాదారు ప్రొఫెసర్ వీఎస్ రావు, కోఆర్డినేటర్లు డాక్టర్ పంకజ్ పాఠక్, డాక్టర్ శోభశ్రీ కోదండరామన్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై ఆగని విచ్ఛిన్నం..

- ఇప్పటికే రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌రెడ్డి
- 1549వ రోజుకు రైతుల ఆందోళనలు


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్ళూరు, మార్చి14: సీఎం పదవి నుంచి తాను దిగిపోయే ముందుకూడా రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేయటం కోసం సీఎం జగన్‌రెడ్డి ప్రయత్నం చేయటం దుర్మార్గమైన చర్య అని 33 వేల ఎకరాలు భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారంనాటికి 1549వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతుధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. భూ సమీకరణ చేసి అమరావతి నిర్మాణం చేయాల్సి ఉండగా.. సేకరించిన భూములను వెనక్కి ఇచ్చేసి అమరావతి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలని సీఎం జగన్‌రెడ్డి కుట్రపన్నారన్నారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో నిర్మితం కావల్సిన అద్భుతమైన అమరావతి నగరం రూపురేఖలు మార్చివేసి జగన్‌రెడ్డి సునకానందం పొందాలనుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీకటి జీవోలు, రహస్య గెజిట్‌లతో ఐదేళ్ల పాలన కు పారదర్శకత లేకుండా చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతిని అభివృద్ధి చేయమని తీర్పుచెప్పినా పట్టించుకోని నియంత సీఎం పాలనలో రాజధాని విధ్వంసానికి గురైందని, ఇలాంటి సీఎం రాష్ట్రాభివృద్ధి గురించి ఏం పట్టించుకుంటాడని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతుల, మహిళల ఆందో ళనలు కొనసాగాయి.

వలిగొండ - కుక్కడం మధ్యన

డబ్లింగ్‌కు నోటిఫికేషన్ జారీ

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో కీలకమైన వలిగొండ - కుక్కడం సెక్షన్ విద్యుద్దీకరణతో రెండో మార్గం నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్ పిలిచింది. మొత్తం 75 కిలోమీటర్ల పొడవునా ఈ సెక్షన్ నిర్మాణం జరగనుంది. ఇందులో వలిగొండ వద్ద మూసీ నదిపై భారీ వంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. అలానే ఎస్ఎస్‌పీ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పైనా హైలెవల్ బ్రిడ్జీ నిర్మించాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.853.08 కోట్లు ఖర్చు అవుతుందని రైల్వేశాఖ అంచనా వేసింది. టెండర్ అప్‌లోడింగ్ ఇప్పటికే ప్రారంభం కాగా ప్రీబిడ్ సమావేశం వచ్చే నెల 26వ తేదీన జరగనుంది. జూన్ 6వ తేదీన టెండర్‌ను ఖరారు చేస్తారు. మొత్తం 33 నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్టుని పూర్తి చేయాల్సి ఉంటుందని రైల్వే శాఖ నిబంధనల్లో పొందుపరిచింది.

విద్యార్థులతో పనులు ..

- మండిపడుతున్న తల్లిదండ్రులు



పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు

కారంపూడి, మార్చి 14: మండల కేంద్రమైన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయించడం వివాదా స్పదంగా మారుతుంది. హెచ్ఎం అనంతశివ విద్యార్థులతో స్కూల్ గ్రౌండ్ ఊడిపించడం, క్లాస్ రూమ్‌లను శుభ్రం చేయించడం, బరువులు మోపించడం, కోడిగుడ్లు, కూరగాయలు ఒలిపించడం వంటి పనులు చేయిస్తున్నారు. చదువు చెప్తారని పాఠశాలకు పంపిస్తుంటే పనులు చేయించడమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

1,27,998 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,36,004 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,27,998 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 93,750 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19000
నెంబరు. 5	10500	19000
273	13000	14500
341	10000	19000
4884	11000	15800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	19800
దేవనూరు డీలక్స్	10000	18000
తెల్లకాయలు	5000	12500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.18
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

యరపతినేనికి గురజాల సీటు కేటాయింపుపై హర్షం

● పిడుగురాళ్లలో భారీ ర్యాలీ, బాణసంచా పేల్చిన యువత

పిడుగురాళ్ల, మార్చి 14: గురజాల టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు పేరు రెండవ జాబితాలో ఖరారు కావడంతో నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, తెలుగు తమ్ముళ్లు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చారు. 7వ సారి గురజాల నుండి పోటీ చేయనున్న యరపతినేని శ్రీనివాసరావును పలు మండలాల పార్టీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. పుట్టి పెరిగిన నియోజకవర్గంలో తన వెన్నంటి వుండి కష్టనష్టాలను పంచుకొని తోడుగా వున్న ప్రతి కార్యకర్తకు, గురజాల నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి వుంటానని యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం పిడుగురాళ్లలో టీడీపీ, జనసేన నేతలు ఉమ్మడిగా పార్టీ కార్యాలయంలో యరపతినేని శ్రీనివాసరావును కలిసి భారీ కేక్ కట్‌చేయించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి బాణ సంచా కాల్చారు.

● గురజాలటౌన్, మార్చి 14: టీడీపీ గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించడంపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్వీట్లు పంచారు. రానున్న ఎన్నికల్లో యరపతినేనిని గెలిపించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని తీర్మానించారు.

● మాచవరం, మార్చి 14: గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు రెండవ విడత జాబితాలో సీటు ప్రకటించడం పట్ల మండల దేశం పార్టీ నాయకులు గురువారం టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో యరపతినేని శ్రీనివాసరావును గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు యడ్లపల్లి రామారావు, చల్లాపల్లి నరసింహారావు, కొల్లి కృష్ణమూర్తి, పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●దాచేపల్లి మార్చి 14 : గురజాల టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు పేరు ప్రకటించటంతో గురువారం దాచేపల్లి మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. దాచేపల్లి, కేశానుపల్లి, పెదగార్లపాడు, రామాపురం, మాదినపాడు, తంగెడ, తక్కెళ్లపాడు, పొందుగల, శ్రీనగర్, నడికూడి గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు జెండాలు చేతబూని ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాలలో గుంటుపల్లి నాగేశ్వరరావు, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, నర్రా పుల్లయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, అక్కినపల్లి బాలయ్య, వేముల తిరుమల కుమార్, మామిడి చంద్రశేఖరరావు, వేముల వినోద్‌రెడ్డి, పురంశెట్టి పరంజ్యోతి, నెల్లూరి రామకోటయ్య, కూరాకుల నాగేశ్వరరావు, రుద్రాల అచ్చారావు, షేక్ మహ్మద్ రఫీ, బొమ్మిరెడ్డి నారాయణ, వేముల కృష్ణ, చికెన్ జానీబాషా, ఉన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం : బ్రహ్మారెడ్డి



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మార్చి 14: టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని 22, 23 వార్డుల్లో బ్రహ్మారెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. బ్రహ్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, దేరంగుల ఏడుకొండలు ఆధ్వర్యాన వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, అంజి తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి, మార్చి 14 : దుర్గితోపాటు మండలంలోని ఆత్మకూరుకు చెందిన సుమారు 15 వైసీపీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వెల్దుర్తిలోని తన గృహంలో వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో కష్టించి పని చేసే వారికి సముచితస్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. ఇటీవల కాలంలో మండలంలో టీడీపీ చేరికలు ఎక్కువగా ఉంటుండడంతో టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మారెడ్డి గెలుపుతో మాచర్లకు మంచి రోజులు

కారంపూడి, మార్చి 14: బ్రహ్మారెడ్డి గెలుపుతో మాచర్ల నియోజకవర్గానికి మంచి రోజులు వస్తాయని మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, టీడీపీ నేత కర్ణ సైదారావు అన్నారు. కారంపూడిలోని తోట బజారులో గురువారం శంఖారావం-బాబు సూపర్ సిక్స్ పథకాలు కార్యక్రమం నిర్వహించారు. నరమాలపాడు-పేటసన్నిగండ్ల రహదారి ఛిద్రమైనప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్ జానీ, కాపు సంఘ నేత మిరియాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి తోట నరసింహారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ నేత బాలు నాయక్, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, నాగవరపు రాముడు, బొంకూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ నేతలు ఎస్‌పీఆర్ కృష్ణ, బవిరిశెట్టి పూర్ణచంద్రరావు, కాసుల శంకర్, షేక్ మోదీన్‌సా, తెలుగు యువత అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, షేక్ నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడు సర్పంచ్‌గా కిచ్చంశెట్టి ప్రమాణస్వీకారం

దాచేపల్లి, మార్చి 14 : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ జనసేన పార్టీ సర్పంచ్‌గా కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం తక్కెళ్లపాడు గ్రామంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి టీడీపీ జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, కన్నా రజని ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. యరపతినేని శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలకు మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బాణసంచాకాల్చి కనకతప్పెట్లతో పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

మాచర్ల రూరల్, మార్చి 14 : మండలంలోని జమ్మలమడకకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి జనసేనలోకి చేరాయి. మాచర్లలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో వట్టెం నరసింహారావు, ఓబులశెట్టి సుధీర్, ఆది, శివకృష్ణ యాదవ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పులి హరి, నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, మండల అధ్యక్షుడు గుండెబోయిన సాంబశివరావు, గొబ్బూరి గోపి, నార్ల అంకారావు, శ్రీరామ్మూర్తి, పులిబండ్ల అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు రాజు ఆలయం ప్రారంభం

కారంపూడి, మార్చి 14: కారంపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీస్తు రాజు ఆలయాన్ని గురువారం గుంటూరు మేత్రాసన పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రారంభించారు. అనంతరం క్యాథలిక్ చర్చి విచారణ గురువులు ఫాదర్ ఆంథోని బాల 35వ గురు పట్టాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధికే.. అరాచకానికే మధ్య పోటీ

● టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 14 : ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని సామాజిక వర్గాలు ఇబ్బందులు పడ్డాయని గురజాల టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పిడుగురాళ్లలో పార్టీ కార్యాలయం వద్ద గౌడ సామాజికవర్గీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలో కమ్యూనిటీ హాలు ఆధునీకరణతో పాటు పిడుగురాళ్లలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు బ్రాహ్మణపల్లిలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని కూడా తాను నెలకొల్పుతానన్నారు. ఈ సమావేశంలో యడవల్లి కొండలు, యరగాని వెంకట్, ఉసిరికాయల అంకారావు, ఉసిరికాయల తిరుమలరావు, యడవల్లి సాంబశివరావు, యరగాని హనుమంతరావు, దాసరి నాగరాజు, ఉప్పలపాటి మణి, యరగాని నాగేశ్వరరావు, జానకిరామయ్య, రమేష్, గోపి, వడ్డెంగుంట సురేష్, ఆట్ల మురళీ, బలగాని వెంకటేశ్వర్లు, మోర్ల ప్రసాద్, యార్లగడ్డ శ్రీను, శివరామకృష్ణయ్య, గాలి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ ఆత్మీయ సమావేశం

స్థానిక కల్యాణ మండపంలో గురువారం గురజాల నియోజకవర్గ వాల్మీకి బోయల ఆత్మీయ సమావేశంలో యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు అభివృద్ధికి.. అరాచకానికి మధ్య జరుగుతున్నాయని, ప్రతిఒక్కరు అభివృద్ధిని కాంక్షిస్తూ టీడీపీని బలపరచాలన్నారు. ఈ సమావేశంలో ముప్పన వెంకటేశ్వర్లు, డాక్టర్ కెపి వెంకయ్యతో పాటు పలువురు సంఘ నేతలు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

70 కుటుంబాలు టీడీపీలో చేరిక

పట్టణంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 70 కుటుంబాల వారు వైసీపీ విధానాలతో విసుగు చెంది గురువారం గురజాల టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేస్తూ పథకాలను పక్కదారి పట్టిస్తున్న వైసీపీ ఓటమికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సిహెచ్ గోపి, ఎం.నాగేశ్వరరావు, ఎన్.సాయి, పి.ఆకాష్, జె.గోపి, బి.ఉదయ్, కె.సాగర్, ఎం రవీంద్ర తదితరులకు యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల బాబు, గుండాల ఆనంద్, వర్ల రత్నం, చల్లగుండ్ల అచ్చారావు, రూబెన్, కుక్కమూడి జార్జి, పురుషోత్తం, గుజ్జర్లపూడి కరుణాకర్, గంగవరపు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రెంటచింతల రాక

రెంటచింతల, మార్చి 14 : నరసరావుపేట లోకసభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తొలిసారి శుక్రవారం రెంటచింతలలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డితో కలిసి టీడీపీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం స్టేషన్ రోడ్డులో భారీ బహిరంగ సభలో పాల్గొనబోతున్నారు. సెయింట్ ఆన్స్ పాఠశాల నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీతో గ్రామంలోకి తోడ్కొని వచ్చేలా ఏర్పాట్లు చేశారు.

● దుర్గి, మార్చి 14: దుర్గిలో శుక్రవారం నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి పర్యటించనున్నారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ నేతలు కోరారు.

● కారంపూడి, మార్చి 14: కారంపూడిలో శుక్రవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి స్థానిక రాఘవయ్య కాంప్లెక్స్ వద్ద పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్యలు పిలుపునిచ్చారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి : జోజిరెడ్డి

రెంటచింతల, మార్చి 14 : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును ఇవ్వడంతో పాటు పగటిపూటే సరఫరా చేయాలని టీడీపీ మండల రైతు సంఘ అధ్యక్షులు తుమ్మా జోజిరెడ్డి కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ అందించారని ప్రస్తుత ప్రభుత్వం 7 గంటల పాటే సరఫరా చేస్తుందన్నారు. అదీ కూడా సరిగా సరఫరా కావడం లేదన్నారు. లోవోల్టేజ్ వలన మోటార్లు కాలిపోతున్నాయన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మాచర్ల రూరల్, మార్చి 14 : పట్టణంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం అధికారులు పరిశీలించారు. కేంద్రాల్లోని వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య : ఎమ్మెల్యే పీఆర్కే

విజయపురిసౌత్, మార్చి 14 : గురుకుల డిగ్రీ కళాశాలల ఏర్పాటుతో పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ విద్యకు చేరువయ్యారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఏపీఆర్‌డీసీలో రూ.1.40 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం, రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను గురువారం ఆయన పరిశీలించి ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, జడ్పీటీసీ మల్లుస్వామి, తాళ్లపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, శ్రీనివాసరావు, సైదులు పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 14: మిరియాల నుంచి అడిగొప్పుల, జనార్ధనపురం వరకు రూ.8 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, జడ్పీటీసీ షేక్ షఫి, ఎంపీటీసీ కొమ్మిరెడ్డి గురవారెడ్డి, మాజీ ఎంపీపీ శారదా శ్రీనివాసరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యాన ర్యాలీ

మాచర్ల రూరల్, మార్చి 14 : ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ ఆందోళనకు మద్దతుగా గురువారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యాన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు నాయక్, పోలేపల్లి అబ్రహం లింకన్, సురేష్, శ్రీను, వెంకటరత్నం, రమణ, కోటేశ్వరి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శిగా వాసు

మాచర్లటౌన్, మార్చి 14 : టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా మాచర్ల వాసు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నియామక ఉత్తర్వులు పంపారు. వాసు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ సీనియర్ నేత పూర్ణచంద్రరావు రాజీనామా

కారంపూడి, మార్చి 14! వైసీపీ పేటసన్నిగండ్ల సీనియర్ నేత గాడిపర్తి పూర్ణచంద్రరావు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో రాఘవయ్య కాంప్లెక్స్‌లో టీడీపీలో చేరనున్నట్లు చెప్పారు.

సంక్షేమం ముసుగులో వైసీపీ కట్టు కథలు : కనుమూరి

సత్తెనపల్లి, మార్చి 14 : సంక్షేమం ముసుగులో వైసీపీ ప్రభుత్వం కట్టు కథలు అల్లుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కరపత్రాలను వలంటీర్లు పంపిణీ చేస్తూ ఫొటోలు తీసుకుంటున్నారన్నారు. కొంత మందికి లబ్ధి చేకూరకున్నా చేకూరినట్టు కరపత్రాల్లో ముద్రించి ఇస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో కరపత్రాల ప్రచారం ఏంటంటూ ఆయన ప్రశ్నించారు. ఒక్కొక్క పత్రానికి రూ.5 నుంచి రూ.10 ఖర్చవుతుందని, కరపత్రాల కోసం కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్నారు.

ఓటమిని ఖరారు చేసుకున్న అంబటి : సంగీతరావు

సత్తెనపల్లి, మార్చి 14 : మంత్రి అంబటి రాంబాబు తన ఓటమిని ఖరారు చేసుకున్నారని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బక్కా సంగీతరావు అన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 5 సంవత్సరాల కాలంగా మంత్రి అంబటి రాంబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.

చేజర్ల విలేజ్ క్లినిక్‌కు ఆక్సిజన్ కామ్ సెంటర్ అందజేత

నకరికల్లు, మార్చి 14: చేజర్లలోని విలేజ్ క్లినిక్‌కు హైదరాబాద్‌కు చెందిన మిడ్ వేస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ప్రతినిధులు రెండు ఆక్సిజన్ కామ్ సెంటర్స్‌ను గురువారం అందజేశారు. 20 లీటర్ల సామర్థ్యం గల వీటి విలువ లక్షా 80 వేల రూపాయల వరకు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కోడె శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పి వెంకటరెడ్డి, ఎఎన్‌ఎం కుమారి, వడ్లపాటి విజయభాస్కరరెడ్డి, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు. విలేజ్ క్లినిక్ ఉద్యోగులు దాతలకు అభినందనలు తెలియజేశారు.

టీడీపీతోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి సాధ్యం

సత్తెనపల్లి మార్చి 14 : టీడీపీతోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి సాధ్యం అని టీడీపీ ముస్లిం మైనారిటీ నేతలు అన్నారు. టీడీపీ ప్రజావేదికలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ 5 సంవత్సరాల పాటు బీజేపీతో వైసీపీ అంటకాగిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ముస్లిం మైనారిటీలంతా టీడీపీకి అండగా ఉంటామన్నారు. టీడీపీ నేతలు సయ్యద్ పెదకరిముల్లా, సయ్యద్ మాభు, జానీ ఖాజావలి, రాంబో భుడే, నూర్‌భాషా జానీబాబు, సయ్యద్ షేర్ అలీ, స్టార్ సభానీ, సయ్యద్ నాగులూ, షేక్ చిన్నకరి, అహ్మద్, అబీబుల్లా, రజినీషిలార్ ఉన్నారు.

ప్రవీణ్‌కు టిక్కెట్‌కు ఇవ్వటంపై టీడీపీ నాయకుల సంబరాలు

బెల్లంకొండ, మార్చి 14 : పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను నియమించటంపై బెల్లంకొండ మండల టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో బాణా సంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, పీఎస్‌కే రసూల్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వెన్నా సీతారామిరెడ్డి, డాక్టర్ హనుమంతరావు, సలాం, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, సయ్యద్ జానీ, సయ్యద్ జబ్బార్, చిట్టి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● క్రోసూరు, మార్చి 14 : భాష్యం ప్రవీణ్‌కు పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ కేటాయించటంపై క్రోసూరులో టీడీపీ శ్రేణులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులందరూ బాణసంచా కాలుస్తూ నినాదాలు చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులందరూ ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ర్యాలీ నిర్వహించారు.

గెలుపే ధ్యేయంగా పని చేయాలి : వెంకటరామిరెడ్డి

బెల్లంకొండ, మార్చి 14 : తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని మండల టీడీపీ నాయకుడు అక్కల వెంకట రామిరెడ్డి అన్నారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, పార్టీ నేతలు ఇబ్రహీం, మేళం శ్రీరామమూర్తి, చిట్టి, వెన్నా సీతారామిరెడ్డి, గుంజా గంగారావు, గుంజా శివ, కిచ్చారెడ్డి, పీఎస్‌కే రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతులకు మద్దతుగా నిరసన

ముప్పాళ్ళ మార్చి 14: ఢిల్లీ రైతలకు మద్దతుగా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ముప్పాళ్ళలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనలో రైతు సంఘం పలనాడు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు గారా జాలయ్య, మార్పుల వెంకటరెడ్డి, తొరటి అమరలింగేశ్వరరావు, కందిమళ్ళ సాంబశివరావు, పఠాన్ సైదాఖాన్, కంచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

సత్తెనపల్లి రూరల్, మార్చి 14 : జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని ధూళిపాళ్ళలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు వేడుకల్లో పాల్గొని పార్టీ జెండాను ఎగుర వేశారు. కేక్‌ను కట్ చేశారు.

● సత్తెనపల్లి మార్చి 14: సత్తెనపల్లి జనసేన కార్యాలయంలో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకటప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, నాదెండ్ల నాగేశ్వరరావు, కేశవ పాల్గొన్నారు. ధూళిపాళ్ళలో కూడా జనసేన పార్టీ జెండాను బొర్రా వెంకటప్పారావు ఆవిష్కరించారు.

● పిడుగురాళ్ళ, మార్చి 14 : జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జనసేన నేతలు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు కామిశెట్టి రమేష్, మునగా వెంకట్, యర్నాన రామకృష్ణ, ఖాశింసైదా, నాగేంద్ర, పసుపులేటి నరసింహారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ మార్చి 14: మండలంలోని పలు గ్రామాలలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. జనసేన జెండాను ఎగురవేసి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శిరిగిరి పవన్‌కుమార్, పఠాన్ లాలు, రుద్రజడ బుల్లబ్బాయి, షేక్ గౌస్, పోగుల రాము, ఆళ్ళ రమేష్, షేక్ బాషా తదితరులు ఉన్నారు.

● రాజుపాలెం, మార్చి 14 : జనసేన పార్టీ మండలాధ్యక్షులు తోట నరసయ్య ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యాలయం ఎదురు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారిలో జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతురావు, ప్రదాన కార్యదర్శి కేదారి రమేష్, నాయకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, చెవుల ఆంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు నారపుశెట్టి కోటేశ్వరరావు, పగడాల నరసింహరావు, పోతంశెట్టి వెంకటరామయ్య ఉన్నారు.

● దుర్గి, మార్చి 14: దుర్గిలో గురువారం జనసేన నేతలు ఘనంగా నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రుద్రాల రవి, కటకం భవన్నారాయణ, బీమా అమరయ్య, పగడాల కిట్టయ్య, కాకర్ల హనుమంతురావు, కోరె నాగరాజు, వెలిదండి వేణుగోపాల్, మిర్యాల హనుమంతురావు, టీడీపీ నేతలు పగడాల చెన్నకేశవ, బీజేపీ నేతలు వెలిదండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, మార్చి 14 : పెదకూరపాడులో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం వద్ద మండల జనసేన అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు జెండాను గురువారం ఆవిష్కరించారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన ప్రతినిధులు వాకా అఖిల్, శాఖమూరి శ్రీనివాసరావు, బిల్లూరి సురేష్, కట్టెపోగు వీరబ్రహ్మం, ప్రత్తి శరీలు, సిద్దంశెట్టి బుచ్చిబాబు, వేమూరి సంజీవరావు, గుండ్లపల్లి హనుమంతరావు, కడియాల హనుమాన్, కందుల లక్ష్మీకాంత్, పెద్దింటి మధు, కొత్తంశెట్టి వేదాద్రి, పమిడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పని చేయాలి : కన్నా



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 14 : రాక్షసుడి చేతిలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకొనేందుకు అందరూ ఐక్యంగా పని చేయాలని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో గురువారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ రాష్ట్రానికి సైకో పాలన నుంచి విముక్తి కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సైకో నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుందామన్నారు. ఈనెల 17న చిలకలూరిపేట దగ్గర టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తరలి రావాలన్నారు. సమావేశంలో తాతా జయ ప్రకాష్ నారాయణ, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, సయ్యద్ పెద కరిముల్లా, కటకం రామకృష్ణ, చవిటి భవన్నా రాయణ, శిరిగిరి శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, సైదారావు, తోట నరసయ్య, శిరిగిరి పవన్, నామాల పుష్పలత, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, నాదెండ్ల సత్యనారాయణ, జనసేన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజక వర్గ బీసీ కమిటీ కార్యవర్గం ఎన్నిక

సత్తెనపల్లి, మార్చి 14 : సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ బీసీ కార్యవర్గాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు తొరటి వెంకటరావు గురువారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా బత్తుల రామకోటేశ్వరరావు, దమ్మాలపాటి వాసు, తూమాటి యలమందేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పోతుల అనీల్ కుమార్ యాదవ్, అధికార ప్రతినిధులుగా కోటపాటి శ్రీనివాసరావు, గుడికందుల వీరాంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పొదిలి గోపయ్య, వేముల వెంకట్రామయ్య, బొంతా సాంబశివరావు, ఓర్సు పెద సింగయ్య, శివకృష్ణ, కార్యదర్శులుగా కొమ్ము వెంకటరావు, నీలం అమరలింగేశ్వరరావు, భరత్ హరీష్, బుర్రి లక్ష్మీనారాయణ, బత్తుల శివ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా సుంకర వెంకటరావులు నియమితులయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బత్తుల వెంకట స్వామి, నూర్ బాషా జానీబాబు, డబ్బుకొట్టు నారాయణ ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

సత్తెనపల్లి రూరల్, మార్చి 14 : మండలంలోని కట్టావారిపాలెంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 70 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం అని నమ్మి పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నువ్వుల రాంబాబు, మాజీ సర్పంచ్ బండారుపల్లి నరసింహారావు, కొబ్బరి సుబ్బారావు, కోయ లక్ష్మయ్య ఉన్నారు. మండలంలోని పెదమక్కెనలో కూడా వైసీపీకి చెందిన గోగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఉల్లం రమణారావు, పుల్లం రామారావు, బచ్చు బాల కోటయ్య, ఇంకొల్లు సుబ్బారావు, హనుమయ్య, వీర రాఘవయ్య, వెంకయ్య కుటుంబాలు గురువారం కన్నా సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, మండదపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్‌ను కలసి బొకే అందిస్తున్న ప్రవీణ్



ప్రవీణ్‌ను శాలువాతో సత్కరిస్తున్న కొమ్మాలపాటి

లోకేశ్, కొమ్మాలపాటిని కలసిన భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 14 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించారు. ఈ సందర్భంగా పార్టీ విజయమే లక్ష్యంగా అందరినీ కలుపుకొని వెళ్లాలని లోకేశ్ సూచించారు. అలాగే పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ గురువారం గుంటూరులోని కొమ్మాలపాటి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను శాలువాతో కొమ్మాలపాటి సత్కరించారు.

అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన భాష్యం ప్రవీణ్

అమరావతి, మార్చి 14 : పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను నియమించడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు తన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రవీణ్ ప్రకటించారు. పెదకూరపాడు సీటును అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబు నాయుడుకు బహుమతిగా అందజేస్తానని అన్నారు.

పార్టీ నిర్ణయానుసారం నడుచుకోవాలి : కొమ్మాలపాటి

అమరావతి, మార్చి 14 : తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం ప్రకారం నాయకులు నడుచుకోవాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ నియోజకవర్గ పరిధిలోని నాయకులను కోరారు. శ్రీధర్ తన కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమై పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను ప్రకటించడంపై నాయకులు ఎలాంటి పార్టీ వ్యతిరేక నిర్ణయాలకు పాల్పడవద్దని అన్నారు. రెండు పర్యాయాలు తనను ఎమ్మెల్యేగా ఆదరించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో వైద్యం అందక శిశువు మృతి

సత్తెనపల్లి మార్చి 14: సకాలంలో వైద్యసేవలు అందక గర్భంలోనే శిశువు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో గురువారం ఉదయం జరిగింది. రాజుపాలేనికి చెందిన గుత్తా రాజకుమారి మొదటి కాన్పు నిమిత్తం బుధ వారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చింది. ఆ సమయం లో డ్యూటీలో ఉన్న డాక్టర్ ఆదేశాల మేరకు స్కానింగ్, ఇతర పరీక్షలు చేయించుకుని వైద్యశాలలో చేరారు. రాత్రి సమయం లో తన సోదరికి సెలైన్ బాటిల్ పెట్టారని అర్ధరాత్రి 12 గంటల సమయంలో పొత్తికడుపు నొప్పి వస్తుందని చెప్పినప్పటికీ డ్యూటీలో ఉన్న సిబ్బంది పట్టించుకో లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుకు తెలియజేసింది. గురు వారం ఉదయం 8.30 నిమిషాలకు డాక్టర్, సిబ్బంది తన సోదరికి ఆపరేషన్ చేశారని బిడ్డ పొట్టలోనే మృతి చెందిందని ఆమె ఆవేదనతో తెలిపింది. డ్యూటీలో ఉన్న డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతి చెందిందని తెలిపింది. గైనకాల జిస్టు డాక్టర్ సుజాత మాట్లాడుతూ నాగరాజకుమారికి ఉమ్మనీరు తక్కువగా ఉండటం వలన ఆసుపత్రిలో జాయిన్ చేసుకుని చికిత్స అందిస్తున్నామని, ఉమ్మ నీరు పూర్తిగా పడిపోవడం వలన బిడ్డ మృతి చెందిందని తెలిపారు. తన బిడ్డ మృతికి పూర్తి కారణాలను తెలియజేయాలని నాగరాజకుమారి భర్త అనంత్ సూపరింటెండెంట్ లక్ష్మణరావును కోరారు. పట్టణ సీఐ ప్రభాకరరావు జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించి డీఎస్పీకి తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

దాచేపల్లి, మార్చి 14 : దాచేపల్లిలోని అమరలింగేశ్వర కోల్డ్ స్టోరేజ్ సమీపంలో గురువారం భట్రుపాలెం గ్రామానికి చెందిన బాలు నాయక్ ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బాలునాయక్ గాయాలపాలు కాగా ప్రథమ చికిత్స నిర్వహించి గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంఘాల ధర్నా

క్రోసూరు, మార్చి 14 : క్రోసూరులోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఆవుల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి బాబు, రైతు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు, మార్చి 14: నకరికల్లులోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్‌లో ప్రజాసంఘాల నేతలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నేత ఈవూరి లక్ష్మారెడ్డి, పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, మహిళా నేత గాదె కుమారి, ముజావర్ జాన్ అహ్మద్, పిచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఓటు హక్కు వజ్రాయుధం వంటిది

● కలెక్టర్ శివ శంకర్

నరసరావుపేట రూరల్, మార్చి 14: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని మీడియా పాయింట్‌లో ఓటు హక్కు విలువలు తెలుపుతూ ప్రచురించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన నిర్వహించారు. నీ ఓటు, నీ భవిష్యత్తు, ఓటును అమ్ముకోవద్దు, నిస్వార్థంగా సేవలందించే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, అటవీ శాఖ అధికారి రామచంద్రరావు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోత, కుట్లు లేకుండా ఊబకాయానికి చికిత్స

● డాక్టర్ మన్నె గౌతమ్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మన్నె గౌతమ్

నరసరావుపేట రూరల్, మార్చి 14: ఇంట్రా గ్యాస్ట్రిక్ బెలూన్ విధానం ద్వారా కోత, కుట్లు లేకుండా డేకేర్లోనే పద్ధతి ద్వారా ఊబకాయానికి ఆధునిక చికిత్సా విధానం అందుబాటులోకి వచ్చినట్లు డాక్టర్ మన్నె గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నె గౌతమ్ మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో తినే తిండి, సరైన వ్యాయామం లేనందువలన యువత ఊబకాయంతో బాధపడుతున్నారన్నారు. ఈ జీవన శైలిలో మార్పును కోరుతూ ఊబకాయంను తగ్గించుకోవటానికి సర్జరీలకు వెళ్లవలసి వస్తుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్యాస్ట్రోఎంటరాలజీ డిపార్టుమెంటులో ఆధునికి చికిత్స విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇంట్రా గ్యాస్ట్రిక్ బెలూన్ విధానం ద్వారా కోత, కుట్లు లేకుండా డేకేర్లోనే పద్ధతి ద్వారా అదేరోజు ఇంటికి పంపించవచ్చు అని తెలిపారు. గురువారం మ్యాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్‌లో ఈ అత్యాధునిక చికిత్సను అందించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. పల్నాడు జిల్లా, పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ వై. వెంకటరామయ్య తెలిపారు.

రాజకీయ లబ్ధికోసమే రోశయ్య విగ్రహం ఏర్పాటు

● బీజేపీ నాయకుల విమర్శ

వినుకొండ టౌన్, మార్చి 14: మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ రోశయ్య విగ్రహాన్ని ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడాన్ని భారతీయ జనతాపార్టీ నాయకులు గురువారం తీవ్రంగా వ్యతిరేకించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య మరణించినపుడు రాని జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల సమయంలో ఆయనపై ఎనలేని ప్రేమ కురిపించడాన్ని ప్రశ్నించారు. ఆయన మృతికి సచివాలయంలో కనీసం ఆయనకు తీర్మానం చేయలేదన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కాంస్య విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు చేస్తానని చెప్పి అనుమతి లేని సిమెంట్ విగ్రహం ఏర్పాటు చేయడంపై ప్రశ్నించారు. కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయాలని చూడటం తగదన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రాఘవ, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న వినుకొండను బొల్లా అల్లర్లకు పులిగొల్పుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళ మోర్చ జిల్లా నాయకులు సుజాత, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి లెనిన్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు వైసీపీతో ఉన్నారనే అక్కసు: ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ, మార్చి 14: మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని కూల్చేందుకు ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన కుట్ర పన్నారని స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. స్థానిక వైసీపీ పార్టీ కార్యలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తుంటే ఓర్చుకోలేక దాడులకు ప్రయత్నించారని, టీడీపీ నాయకులు అరాచకాలకు పురిగొల్పుతున్నారని మండిపడ్డారు. ఆర్యవైశ్యులు వైసీపీకి అండగా ఉంటున్నారని చూసి ఓర్చుకోలేకపోతున్నారన్నారు. ప్రధానంగా మక్కెన వ్యవహారశైలిని ఆయన తీవ్రంగా ఖండించారు.



పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వైసీపీని వీడి టీడీపీలోకి భారీ చేరికలు

వినుకొండ, వినుకొండ టౌన్ మార్చి 14: పట్టణంలోని 19, 20వ వార్డుల నుంచి వైసీపీని వీడి టీడీపీలోకి 60కుటుంబాలు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, మక్కెన మల్లిఖార్జునరావు సమక్షంలో టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మక్కెన, జీవీలు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ జాని, గోల్డ్ కరిముల్ల, పివి సురేష్, పత్తి పూర్ణ, ఆయూబ్‌ఖాన్, డాక్టర్ ఆరోగ్యం, చిట్టెంశెట్టి శ్రీను, సుబ్బారావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

● నూజండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సుమారు 100మంది వైసీపీ నుంచి జీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నేలపాటి వెంకటేశ్వర్లు, చిన్నబ్బాయి, వసపుత్ర ఈశ్వరయ్య, సింగు, నేలపాటి కొండలు, చీమకుర్తి శ్రీనివాసరావు, ఆలకుంట రామయ్య, రామాంజనేయులు, ఏసు, అంజలి, కార్తిక్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

● పిచికలపాలెం (శావల్యాపురం): మండలంలోని పిచికలపాలెంలో వైసీపీకి చెందిన 12 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావుల సమక్షంలో బుధవారం రాత్రి టీడీపీలోకి చేరారు. వినుకొండలోని గంగినేని ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కొత్తగా పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ గాలి నాగేశ్వరరావు, గణపర్తి అంజయ్య, జాగర్లమూరి బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, అల్లూరి రామాంజనేయులు, యాగంటి వెంకటేశ్వర్లు, తిరువీధి పెదఅంజయ్య, వెంకటకోటయ్య, రామసుబ్బారావు, బుజ్జి, అశోక్, వెంకటేశ్వర్లులకు జీవీ, మక్కెనలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, టీడీపీ నాయకులు పొందూరి అంజయ్య, టి.శ్రీనివాసరావు, పి.రామచంద్రబాబు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఆత్మీయ సమావేశం

వినుకొండ, మార్చి 14: పట్టణంలోని కారంపూడి రోడ్డులోని బొల్లా కన్వెన్షన్ హాల్‌లో వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరావుపేట పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి అనిల్‌యాదవ్ మాట్లాడుతూ వైసీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, జగన్మోహన్‌రెడ్డి కోసం, వైసీపీ విజయవంతం కోసం పనిచేసే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతోపాటు శాసన సభ్యుడు మద్దాల గిరి, నియోజకవర్గపార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గాళ్ళేశ్వరరావు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగబాబు, సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను

క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ

వినుకొండటౌన్, మార్చి 14: మండలంలోని ఏనుగుపాలెంలో జనసేన పార్టీకి చెందిన నల్లమీద గాళ్ళేశ్వరరావు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కొణిజేటి నాగశ్రీనురాయల్ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యులకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగబాబు చేతులమీదుగా బాధిత కుటుంబాలకు రూ.ఐదు లక్షల చెక్కును బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నాగశ్రీను మాట్లాడుతూ ప్రమాదశాత్తు మృతిచెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అండగా నిలిచారన్నారు.

ఆప్షన్ ప్రకారం బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేయాలి

● భూములు కోల్పోయిన రైతుల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న భూములు కోల్పోతున్న వివిధ గ్రామాల రైతులు

నరసరావుపేట టౌన్, మార్చి 14: స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకొని నరసరావుపేట మున్సిపల్ బౌండరీకి అవతల ఆప్షన్-2, ఆప్షన్-3 లలో 167ఏ కోసం ఏర్పాటు చేసే బైపాస్ రోడ్డు కోసం నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం నకరికల్లు-చీరాల ఓడరేవు కోసం ఎన్‌హెచ్ 167ఏ రోడ్డు విస్తరణలో భాగంగా నరసరావుపేటకు బైపాస్ రోడ్డు మంజురులో భూముల కోల్పోతున్న రైతులు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో నేషనల్ హైవే వారు రోడ్డు నిర్మాణం కోసం బహిరంగ ప్రకటన విడుదల చేస్తే అభ్యంతరాలు తెలియజేశామన్నారు. దీంతో ల్యాండ్ ఎక్విజిషన్ అధికారులు స్టేక్ హోల్డర్స్ జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతెటి సమక్షంలో 2023 జూలై 18న కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారని అన్నారు. ఆ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, 16 శాఖల అధికారులు పాల్గొన్నారని అన్నారు. సమావేశంలో నరసరావుపేట బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మున్సిపల్ లిమిట్స్‌లో మార్క్ చేశారని, ఆ కారణంగా నరసరావుపేట బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మున్సిపల్ లిమిట్స్‌కు ఆవతలగా మార్చాలని సిఫార్సు చేశారు. మొదటగా ఇచ్చిన అలైన్‌మెంట్‌కు ఖర్చు రూ 787.38 కోట్లు అవుతుందని, కొత్త ప్రతిపాదిత అలైన్‌మెంట్ ఖర్చు రూ 898.33 కోట్లు అవుతందన్నారు. మరో ఆప్షన్ అలైన్‌మెంట్ ఖర్చు రూ 968.85 కోట్లు అవుతుందన్నారు. మొదటి ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రజలకు అసౌకర్యమని, పట్టణాభివృద్ధికి అటంకమని, అలైన్‌మెంట్ మార్చమని సిపార్సు చేశారు. కానీ స్టేక్ హోల్డర్స్ సమావేశం సిపార్సులు గానీ, ప్రజల అభిప్రాయంగానీ అధికారుల నిర్ణయంగానీ పట్టించుకోకుండా మరలా అదే అలైన్‌మెంట్‌నే నిర్ణయించటం దారుణం అన్నారు. నేషనల్ హైవే వారు ప్రతిపాదించిన బైపాస్ నరరావుపేట-సత్తెనపల్లి, నరరావుపేట - గుంటూరు రోడ్డును క్రాస్ చేసే ప్రాంతంలో ఉన్న నివాస గృహాలు, వ్యాపార సంస్థలు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ గోడైన్‌లు కూల్చి వేయవలసి వస్తుందని, నష్టపరిహారం ఎక్కువ అవుతుందన్నారు. నరసరావుపేట మాష్టర్ ప్లాన్ ప్రకారం ప్రస్తుత బైపాస్ రోడ్డు పట్టణంలో అంతర భాగం అవుతుందన్నారు. ప్రజా అభిప్రాయాన్ని, ప్రజల అభ్యంతరాలను, స్టేక్ హోల్డర్స్ సమావేశం ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మున్సిపల్ బౌండరీకి అవతల ప్రతిపాదించిన ఆప్షన్-2/ ఆప్షన్-3 లలో ఒక దానిని అంతిమంగా నిర్ణయించి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ, కేసానుపల్లి, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడు, నరసరావుపేట రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికి వస్తే వదలం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్: కార్యకర్తల జోలికి వచ్చిన వారిని, తప్పుడు కేసులు పెట్టిన వారిని వదిలి పెట్టే ప్రశక్తే లేదని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం రాత్రి పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పరిచయ కార్యక్రమం, నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటలో భారీ మెజార్టీతో గెలవబోతున్నారని అర్థమవుతుందన్నారు. అధికార వైసీపీ అభ్యర్థుల మార్పు నాటకాల్లో చిలకలూరిపేటకు మూడో కృష్ణుడు వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ఎన్ని రోజులు ఉంటారో తెలియదని, దీనిని బట్టే ప్రత్తిపాటి ఎంతబలంగా ఉన్నారో తెలుస్తోందన్నారు. ప్రత్తిపాటి శరత్‌ను అన్యాయంగా అరెస్టు చేసి పుల్లారావుని కోర్టులు చుట్టూ తిప్పుతూ ఎన్నికలు చేయాలని వైసీపీ వారు భావించారన్నారు. పసుమర్రు పేదల స్థలాల్లో స్థానిక ఎమ్మెల్యే కమిషన్ కొట్టేశారని, యడవల్లి భూముల విషయంలో కూడా భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇక్కడి రూ.6.50 కోట్ల వసూలుపై రాష్ట్ర మంతా చర్చించుకుంటున్నారని తెలిపారు. డబ్బులు తీసుకుని మోసం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, కావాలంటే తాము అండగా ఉంటామని ఎంపీ స్పష్టం చేశారు.

ఓటమి భయంతో రోశయ్య విగ్రహావిష్కరణ పేరుతో రాజకీయం

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆంజనేయులు

వినుకొండ, మార్చి 14: బొల్లా బ్రహ్మనాయుడు ఓటమి భయంతో కుయుక్తులు పన్నుతున్నారని బీజేపీ, తెలుగుదేశం, జనసేన కలయికతో కొత్త రాజకీయాలకు తెర తీశారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య మరణిస్తే కనీసం జగన్ చూడటానికి కూడ రాలేదని, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి రోశయ్య ఆప్తుడని, కుడిబుజం లాంటి వారని అటువంటి గొప్ప వ్యక్తికి కాంస్య విగ్రహం ఏర్పాటుచేస్తానన్న భయంతో రాత్రికి రాత్రి అనుమతి లేకుండా సిమెంటు విగ్రహం ఏర్పాటు చేయడంతో ప్రశ్నించారు. అంతేకాకుండా విగ్రహాన్ని కూల్చివేస్తామంటున్నామంటూ తమపై నిందలు మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. జగన్‌కు రోశయ్య చేసిన అన్యాయం ఏమిటని, మృతిచెందినపుడు కనీసం చూడటానికి కూడ రాలేదని ఆయన ఆత్మ ఘోషిస్తుందన్నారు. రోశయ్య అంటే మాకు ఎంతో గౌరవమని తాను, సీఎంగా నారా చంద్రబాబునాయుడు వెళ్ళి నివాళులర్పించామన్నారు. జగన్ కనీసం హైదరాబాద్‌లో ఉండి కూడ ఆయన మృతదేహాన్నిచూడటానికి కూడ రాలేదన్నారు. రానున్న రోజుల్లో రోశయ్య కాంస్య విగ్రహాన్ని వినుకొండలో ఏర్పాటుచేసి అన్ని పార్టీలను ఆహ్వానిస్తామన్నారు. మూడు రోజుల క్రితమే ఎంపీ కార్యక్రమం ఉందని అనుమతులు తీసుకున్నామని పోలీస్ అనుమతులతో గంగినేని కళ్యాణ మండపం నుంచి పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వెళ్ళే సమయంలో కావాలనే విగ్రహం పేరుతో నీవు పట్టణంలో అలజడలు సృష్టించడం ఏమిటని, బొల్లా ఇది నీకు తగునా అని అన్నారు. విగ్రహానికి దండ వేసేందుకు వస్తుంటే గిల్లి మరీ తగాదా పెట్టి కేసులు పెట్టేందుకు ప్రయత్నించావన్నారు. ఉద్దేశ్య పూర్వకంగ కావాలనే అలజడులు సృష్టించేందుకు బొల్లా పథకం పన్నారన్నారు. మా కార్యకర్తలపై వైసీపీ నాయకులు కర్రలతో దాడిచేస్తే ఓ దళితుడికి కన్నుపై గాయమై మూడు కుట్లు పడ్డాయన్నారు. బొల్లా కేవవలం ఓటర్లను, రోశయ్య, ఆర్యవైశ్యులను మోసం చేయడానికే విగ్రహం డ్రామా అని తెలిపారు.

అనంతరం మక్కెన మాట్లాడుతూ రాత్రికి రాత్రి అనుమతులు లేకుండా రోశయ్య విగ్రహం పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైన విగ్రహాల పేరుతో రాజకీయాలు చేయవద్దని పద్ధతి మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా భాష మార్చుకోకపోతే సరైన సమాధానం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ పెండ్యాల శ్రీనివాసరావు మాట్లడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆర్యవైశ్యులపై నిజమైన ప్రేమ ఉంటే జూనియర్ కళాశాలో 20సెంట్లు, గుంటి ఆంజనేయస్వామి గుడివద్ద 18సెంట్లు ఎందుకు ఇప్పించలేకపోయావని నిలదీశారు. హిందూ శ్మశానం వద్ద ఆక్రమణకు గురైన భూములు ఇప్పించపోగా ఆర్యవైశ్యుల వ్యాపారులను బెదిరించలేదా అని నిలదీశారు. ఆయనతోపాటు పువ్వాడ కృష్ణ, గుడివాడ గుర్నాదం, రెడ్డి వెంకటరత్నం, మోటమర్రి వెంకటనరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-1 పరీక్షలపై సీబీఐతో విచారణ జరిపించాలి

● టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్

నరసరావుపేట టౌన్, మార్చి 14 : గ్రూప్-1 పరీక్షలపై సీబీఐ విచారణ జరిపించాలని టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీలోని నిరుద్యోగులకు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని, అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రూప్-1 పరీక్షల నిర్వహిణలో భారీ కుంభకోణం చేశారని విమర్శించారు. చంద్రబాబునాయుడు హాయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో 2018లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేశారని, ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో ప్రశ్న పత్రాల మూల్యాంకనం పలుమార్లు చేయడంతో రాష్ట్రంలో ఉన్నత న్యాయ స్థానం గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయడం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు చెంపపెట్టన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ సంతలో పశువులను అమ్ముకున్నట్లు గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకొని రూ.150 కోట్ల కుంభకోణంచేసి ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బంధువులను ఏపీపీఎస్సీ సభ్యులుగా చేర్చి మొత్తం పరీక్షల వ్యవస్థను, మూల్యాంకనం, ఇంటర్వ్యూ పద్దుతులకు పాతరవేసి 49 వేల ఓఎంఆర్ షీట్లను మార్చివేశారన్నారు. నిరుద్యోగ జేఏసీ, విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆరోపణలపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మౌనం వహించడం వెనక కుంభకోణంలో వైసీపీ పెద్దల పాత్ర ఉందని గ్రూప్-1 పరీక్షల అవకతవ కలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఈబీసీ నేస్తం చెక్కు పంపిణీ

నరసరావుపేట అర్బన్, మార్చి 14: పల్నాడు జిల్లాలో 33,368 మంది ఈబీసీ నేస్తం పథకం కింద రూ 50.5 కోట్ల మేర నగదుకు సంబంధించిన చెక్కును కలెక్టర్ శివశంకర్ లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ చెక్కును అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మూడో విడత నగదు జమ కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాలి వాహన కార్పోరేషన్ ఛైర్మన్ పురుషోత్తం, సుష్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు అభివృద్ధిపై ప్రచార బాధ్యతలు

శావల్యాపురం, మార్చి 14: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనులను గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలంటూ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌లకు గ్రామ, వార్డు సచివాలయ కమిషనర్ నుంచి గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ బాధ్యతలను ఇటీవల వలంటీర్లకు అప్పగించగా కొన్ని గ్రామాలలో వారు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటోలతో కూడిన రెండు పేజీల లేఖను వారికి అందించాలని ఆదేశించినట్లు సమాచారం.

ఎంపీ లావు ఫ్లెక్సీల తొలగింపు

వినుకొండటౌన్, మార్చి14: నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి లావు కృష్ణ దేవరాయలు తెలుగేశంపార్టీలో చేరిక సందర్భంగా పట్టణంలో కొన్ని రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు బుధవారం రాత్రి తొలగించారు. పట్టణంలో ఎంపీ ఫ్లెక్సీల తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపధ్యంలో అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

నరసరావుపేట టౌన్, మార్చి 14 : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో ముఖ్యఅతిధులుగా జనసేన రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ, ఆంధ్ర కో కన్వీనర్ పెండేల బాలాజీ, జిల్లా కార్యదర్శి కటికం అంకారావు హాజరైయ్యారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, అదేపల్లి ఆనంద్, భారీగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎనిమిది గంటలు పనిదినాలు అమలు చేయాలి

నరసరావుపేట టౌన్, మార్చి 14: ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఎనిమిదిగంటలు పనిదినాలు అమలు చేయాలని ఔట్ సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వినుకొండ పేరయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఏపీ మోడల్ స్కూల్‌లో వివిధ రకాల శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచాలని, వారిపై అదనపు పనిభారాన్ని తగ్గించి ప్రభుత్వ సెలవు దినాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నరసరావుపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినుకొండ పేరయ్య మాట్లాడుతూ జీతాలు పెంచి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చాడన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికి వదిలేసాడన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కె.ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, బ్రహ్మయ్య, గొల్లపూడి చిన్నప్రసాద్, స్వరూప్, సీఐటీయు సిలార్, పౌరహక్కుల సంఘం నాయకుడు శిఖినం చిన్న, భారత్ బచావో నాయకుడు కోట నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులన్నీ ఉండాలి

● వినుకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారావు

శావల్యాపురం, మార్చి 14: పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని వినుకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ వరదా సుబ్బారావు అన్నారు. శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల భవనాలు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంప్‌లు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లు గురించి తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్యను అడిగి తెలుసుకొన్నారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వృద్దులు, వికలాంగులకు అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని, పర్నీచర్ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఓటర్ల జాబితాలు, ఫారం-6, ఫారం-7ల గురించి ఆరా తీశారు. ఆర్‌ఐ నాసరయ్య, వీఆర్వోలు మంగయ్య, రాధ, కార్యదర్శి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొగ్గరం ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ

బొగ్గరం(ఈపూరు) మార్చి14: మండలంలోని బొగ్గరంలో ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ గురువారం ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ళను పురస్కరించుకొని భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు,మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. శివశక్తి లీలాఅండ్ అంజన్ పౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహార, తాగునీరు పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని పంపిణీ చేశారు.

ప్రత్తిపాటి శరత్‌కు ఘన స్వాగతం

● టీడీపీ శ్రేణుల్లో జోష్ ● బోయపాలెం నుంచి భారీ ఊరేగింపు



బెయిల్‌పై విడుదలైన ప్రత్తిపాటి శరత్‌ను భుజం పైకి ఎత్తుకొని అభిమానుల ఆనందం

చిలకలూరిపేట, మార్చి 14: మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్ గురువారం విజయవాడ జిల్లా కోర్టు నుంచి బెయిల్‌పై విడుదలై చిలకలూరిపేట రాగా ఘన స్వాగతం లభించింది. గత రెండు వారాలుగా శరత్ జైల్లో ఉన్నారు. బెయిల్‌పై విడుదలైన సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో విజయవాడ జైలు వద్దకు తరలివెళ్ళారు. అభిమానులు, పార్టీ శ్రేణులు పూలమాలలతో శరత్‌కు స్వాగతం పలికారు. శరత్‌కు దిష్టి తీసి తెలుగు మహిళలు సాదరంగా ఆహ్వానించారు. జైలునుంచి బయటకు వచ్చిన కుమారుడిని చూసి పుల్లారావు ఉద్వేగానికి లోనయ్యారు. కుమారుడిని గట్టిగా కౌగిలించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపుతో పెడుతున్న అక్రమ కేసులను ఎదురొడ్డి పోరాడటంతో న్యాయం గెలిచిందన్నారు. శరత్‌ను జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే అభిమానులు భుజం మీదకు ఎత్తుకొని కొద్ది దూరం ర్యాలీ చేశారు. అనంతరం 20కార్లలో శరత్ కారును అనుసరించి బయలుదేరారు. యడ్లపాడు మండలం బోయపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న పార్వతి దేవి అమ్మవారి ఆలయం వద్దకు చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు చేరుకున్నాయి. అక్కడ శరత్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో పూజలు అనంతరం భారీ ఊరేగింపుతో చిలకలూరిపేటకు వచ్చారు. యడ్లపాడు, తిమ్మాపురం, గణపవరం జంక్షన్లతో పాటు చిలకలూరిపేటలో శరత్‌కు ఘనస్వాగతం లభించింది.

రాజేష్ నాయుడుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి పిలుపు

చిలకలూరిపేట, మార్చి 14: చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా తొలగించిన మల్లెల రాజేష్ నాయుడుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి గురువారం పిలుపు వచ్చింది. దీంతో రాజేష్ నాయుడు ఆయన అనుచరులు కొందరు గురువారం తాడేపల్లికి బయలుదేరి వెళ్ళారు. తాడేపల్లికి రావాల్సిందిగా వైవీ సుబ్బారెడ్డి పిలుపు ఇచ్చినట్టు సమాచారం. కాగా గురువారం ఉదయం రాజేష్ నాయుడు కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ ప్రజా ప్రతినిధులు విడివిడిగా సమావేశం అయ్యారు. 24మంది వైసీపీ కౌన్సిలర్లు రాజేష్ నాయుడుకు మద్దతు తెలుపుతున్నట్టు సంతకాలు చేసినట్టు తెలిసింది. మరి కొందరు కూడా ఆయనకు మద్దతు ప్రకటించారు. కాగా చిలకలూరిపేట ఇన్‌చార్జ్‌గా కొత్తగా నియమితులైన కావటి మనోహర నాయుడు ఒకటి రెండు రోజుల్లో చిలకలూరిపేటకు చేరుకొని ఎన్నికలకు సంసిద్ధం అవుతారని తెలియవచ్చింది. ఈ లోగా పార్టీ హైకమాండ్ రాజేష్ నాయుడును శాంతపరిచే ప్రయత్నాలు చేపట్టింది.

వైద్యాధికారుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం

● జిల్లా అధికారులకు ఫిర్యాదు

● పీహెచ్‌సీలో ప్రత్యేక కమిటీ క్షేత్రస్థాయి విచారణ



ఆరోపణలపై పీహెచ్‌సీ వైద్యులను విచారిస్తున్న విచారణాధికారి డాక్టర్ మురళీకృష్ణ

యడ్లపాడు, మార్చి 14: యడ్లపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇద్దరు వైద్యుల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం చినికి చినికి గాలివానగా మారింది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారి డాక్టర్ గోపి నాయక్ పీజీ విద్యకోసం వెళుతూ వేటపాలెం నుంచి బదిలీపై వచ్చిన డాక్టర్ ఎం.ప్రభాకరరావుకు గత ఏడాది నవంబరులో డీడీవో బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి తనకు చార్జి అప్పగించడం గాని, నిర్వహణ నిధుల వివరాలు, వస్తువులు కాని తనకు అప్పగించలేదని డీఎంహెచ్‌వోకు ప్రభాకరరావు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో విచారించి నివేదిక సమర్పించాలని ప్రత్యేక విచారణ కమిటీని నియమించింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విచారణ బృందం సందర్శించి ఇద్దరు వైద్యులను పిలిపించి విచారణ జరిపింది. విచారణ అనంతరం కమిటీకి నాయకత్వం వహించిన జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ తమ విచారణలో డాక్టర్ల మధ్య సమన్వయం లేకపోవడంతోనే సమస్య తలెత్తినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. విచారణలో గుర్తించిన అంశాలను జిల్లా వైద్యశాఖాధికారి దృష్టికి తీసుకెళతామన్నారు. ఇదిలాఉండగా ప్రస్తుత వైద్యాధికారి డాక్టర్ ప్రభాకరరావు తమను తమను వేధిస్తున్నాడంటూ మహిళా ఏఎన్ఎంలు జిల్లా వైద్యాధికారికి మౌఖికంగా చేసిన ఫిర్యాదుపై కూడా కమిటీ విచారణ నిర్వహించింది. విచారణ బృందంలో కన్సల్టింగ్ అధికారి డాక్టర్ వి శ్రీనివాసరావు, నేషనల్ హెల్త్ మిషన్ ఏవో గోరంట్ల నరేష్, జిల్లా వైద్యాధికారి కార్యాలయ అధికారి హరిప్రసాదరావులు ఉన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

యడ్లపాడు, మార్చి 14: యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 22మంది విద్యార్థులకు గుంటూరుకు చెందిన ఆడిటర్ దామచర్ల శ్రీనివాసరావు అండ్ ఫ్రెండ్ సర్కిల్ (డీఎస్‌ఆర్ ఫ్రెండ్ సర్కిల్) ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, వాటర్ బాటిల్‌తో కూడిన కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు శివపార్వతి, అనూరాధ, సునీల్, ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ఎ నాగేశ్వరరావు, బి నాగేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనమర్లపూడిలో పట్టపగలే ద్విచక్రవాహనం చోరీ

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 14: పట్టపగలే ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన మండలంలోని కనమర్లపూడిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనమర్లపూడి ఎస్సీ కాలనీకి చెందిన విజయబాబు తన బొలేరో వాహనానికి మరమ్మతులు చేయించుకోనేందుకు వినుకొండకు వెళుతూ తన హోండాషైన్ బైకును గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి సమీపంలోని తన ఇంటి ముందు నిలిపివెళ్ళాడు. వినుకొండలో పనులు ముగించుకొని మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి బైకు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీనిపై శావల్యాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టపగలు ద్విచక్రవాహనం చోరీకి గురికావడంతో గ్రామస్థుల్లో కలకలం రేగింది.

ఘనంగా కొండవీడు యూపీ పాఠశాల వార్షికోత్సవం

కొండవీడు (యడ్లపాడు), మార్చి 14: మండలంలోని కొండవీడు ఎంపీయూపీ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు, సినీ గేయాలకు వేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో హెచ్‌ఎం శ్రీనివాసరావు పాఠశాల వార్షిక నివేదికను, పాఠశాల ప్రగతిని చదివి వినిపించారు. చేతిరాతకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్ కృషిని వివరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన ఉపాధ్యాయులను, గ్రామ పెద్దలను, అతిధులను ఘనంగా సత్కరించారు.

రైతుల మహా ధర్నాకు వివిధ సంఘాలు సంఘీభావం

చిలకలూరిపేట, మార్చి 14: ఢిల్లీలో రైతులు చేపట్టిన మహా ధర్నాకు మద్దతుగా గురువారం పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు పలు కార్మిక, రైతు సంఘాల నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ రైతులు ఆందోళన చేయాలని నిర్ణయించటంపై హర్షం వ్యక్తంచేశారు. రైతులకు కనీస మద్దతు ధరను ప్రకటించాలని, రైతుల రుణాలను మాఫీచేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన తాళ్ళూరి బాబూరావు, డాక్టర్ కొల్లా రాజ మోహనరావు, రాధాకృష్ణ, బొల్లు శంకరరావు, పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఎం రాధాకృష్ణ, బొంతా భగత్‌సింగ్, మేకపోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.